క్లుప్తంగా...

ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్ కృషి



ట్రెజరీస్ సంచాలకులు మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్ నిరంతరం కృషి చేస్తుందని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్ సంచాలకులు మూర్తికి ఆయన వినతిపత్రం అందజేసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ట్రెజరీస్ శాఖలో ఉద్యోగులను కొందరు వేధిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులను ఎవరైనా వేధిస్తే తాను సహించేది లేదని ముజీబ్ హెచ్చరించారు. ఉద్యోగుల కోసం అండగా ఉంటామన్నారు. వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పల్లేటి వరదరాజు, ఖాదర్‌బిన్ హుస్సేన్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆయుష్ కేంద్రం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు



మందులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఆయుష్ కేంద్రం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి గోషామహల్ నియోజకవర్గం ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆశీష్‌కుమార్ ఆయుష్ కేంద్రం ద్వారా తరచు ఉచిత వైద్య శిబిరాలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

నాంపల్లి: గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను నాంపల్లి శాంతిభద్రతల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 180 గ్రాముల గంజాయితో పాటుగా ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నాంపల్లి తేలిబాడాకు చెందిన లామినేషన్ ఆపరేటర్, అబ్దుల్ సత్తార్ కుమారుడు అబ్దుల్ రహీం (20), అలాగే దారుస్సలాం ప్రాంతానికి చెందిన ఫర్నిచర్ దుకాణంలో పనిచేసే యువకుడు, మహమ్మద్ సర్వర్ ఖాన్ కుమారుడు మహ్మద్ అబ్రార్ (22) ఇద్దరు పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని మహబూబియా గేటు వద్ద శుక్రవారం సాయంత్రం తచ్చాడుతూ కనిపించారు. అనుమానంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదాలు చేశారు. వారి దగ్గర ఉన్న పాలిథిన్ కవర్‌ను తెరిచి చూడగా అందులోని 180 గ్రాముల గంజాయిని, ఒక వెండి రంగు కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉద్యమ నాయకుడికి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వండి



దరఖాస్తు అందజేస్తున్న శంకర్‌లాల్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ బీఆర్ఎస్ టికెట్‌ను తెలంగాణ ఉద్యమంలో ఎంతో కష్టపడిన తనకు ఇస్తే బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తానని ఉద్యమనేత ఆర్.శంకర్‌లాల్ యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో గోషామహల్ బీఆర్ఎస్ టికెట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం శంకర్‌లాల్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పలుసార్లు తెలంగాణ రాష్ట్రం కోసం ఆందోళనలు చేశానన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో శుక్రవారం నుంచి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు పూర్ణ శంగోళం, దివ్యప్రబంధ సేవా కాలం, సాయంత్రం 6 గంటలకు పరమ పదోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేస్తారు. శనివారం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, విశ్వక్‌సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విక్‌వరణం, మృత్స్యంగ్రహణం, అంకురార్పణం, వైనతేయ ధ్వజ ఛాయాధివాసము, మంగళ శాసనం, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద గోష్ఠి ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



వెండి అలంకరణలో దర్శనమిస్తున్న లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారు



సబ్జీమండిలో పూజలు చేస్తున్న మహిళలు



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

గోల్కొండ: కార్వాన్ గంగపుత్ర సంఘం, శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆధ్వర్యంలో సబ్జీమండిలోని గంగా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిగింది. ఈ కార్యక్రమానికి తదితర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆసిఫ్‌నగర్‌లో..

విజయనగర్‌కాలనీ: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ, మాసబ్ ట్యాంక్, మురాద్‌నగర్, జేబాబాగ్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాలలోని మాతేశ్వరీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతం ఆచరించిన మహిళలు ముత్తైదువలకు పసుపుబొట్టు వాయనాలు ఇచ్చి ఆశీర్వచనం పొందారు.

వెండి అలంకరణలో లాల్‌దర్వాజా మహంకాళి..

చాంద్రాయణగుట్ట: శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారు వెండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వెండి చీర, వెండి పూలమాల, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణు గౌడ్, వెంకటేష్‌లు తగిన చర్యలు తీసుకున్నారు.



ఆసిఫ్‌నగర్‌లో..

ప్రత్యేక పూజలు



చార్మినార్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

కేంద్ర మంత్రికి వినతి



కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేస్తున్న చెన్నయ్య

నాంపల్లి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని హరిత ప్లాజాలో రాందాస్ అథవాలేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి సానుకూలతను వ్యక్తం చేసినట్లు చెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్ రావు, బి.ఆనంద్, వై.స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపుల ప్లీనరీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొండ దేవయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: ఈనెల 27న జలవిహార్‌లో జరిగే మున్నూరుకాపుల ప్లీనరీని విజయవంతం చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కోఠిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో జరిగే మున్నూరుకాపుల ప్లీనరీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గోషామహల్ నియోజకవర్గం నుంచి 23 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న ఆర్‌వి.మహేందర్‌కుమార్‌కు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని ఆయన కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ.మహేందర్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు బండారి లత, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వాసాల వెంకన్న, రాష్ట్ర నాయకులు రామేష్, బాశెట్టి నర్సింగ్‌రావు, రాజబాబు, శ్రవణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి తలసానికి సత్కారం



చార్మినార్: సనత్‌నగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి తిరిగి పార్టీ టికెట్ లభించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాములు గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అనూష గోపిగౌడ్, నాయకులు గోపిగౌడ్, అజయ్‌యాదవ్ తదితరులు కలిసి ఆయనకు బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

టప్పాచబుత్ర పీఎస్ పరిధిలో చబుత్ర ఆపరేషన్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ మహ్మద్ జావీద్

విజయనగర్‌కాలనీ: అనవసరంగా అర్ధరాత్రి అరుగుల మీద ముచ్చటిస్తూ కూర్చోవద్దని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మహ్మద్ జావీద్ సూచించారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల వరకు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చబుత్ర ఆపరేషన్ నిర్వహించి 28 మంది యువకులను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పనీపాటలేని వారు అర్ధరాత్రులు రోడ్లపై సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటారని అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఐలు, పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలాభిషేకం

గోల్కొండ: రాష్ట్రంలో మరోసారి భారీ మెజార్టీతో కేసీఆర్ హైట్రిక్ సాధించి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ అన్నారు. ముస్లిం మైనార్టీలకు విరివిగా రుణాలు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన టోలిచౌకి సాలార్‌జంగ్ కాలనీలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పక్కా సెక్యులర్ నాయకుడని, ఆయన పాలన కాలంలో పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడడమే కాకుండా తెలంగాణను బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి కూడా కృషి చేశారన్నారు.

దిలీప్‌రెడ్డికి రామానుజరావు పురస్కారం ప్రదానం



పురస్కారం ప్రదానం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు రమణచారి

సుల్తాన్‌బజార్: బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో దేవులపల్లి రామానుజరావు 106 జయంతి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పత్రిక రచయిత, సీనియర్ జర్నలిస్టు ఆర్.దిలీప్‌రెడ్డికి డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి హాజరై దిలీప్‌రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, సాహిత్య విమర్శకుడు ఆచార్య ఎస్వీ రామారావు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతరెడ్డి, తెలంగాణ జానపద సాహిత్య పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ సి.వసుంధరరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్లకు దరఖాస్తులు

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించనున్నారని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.ఎస్.ఆనంద్ రావు ధీమా వ్యక్తం చేశారు. అంబర్‌పేట్, గోషామహల్ నియోజకవర్గాల నుంచి పార్టీ టికెట్‌ను ఆశిస్తూ ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తులను నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ... తాను కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పని చేస్తున్నానన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో తప్పనిసరిగా విజయం సాధించనున్నామన్నారు.



గాంధీభవన్‌లో దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న కె.ఎస్.ఆనంద్ రావు

చాంద్రాయణగుట్ట టికెట్ కోసం రాజేందర్ దరఖాస్తు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకు కేటాయించాలని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. 1986 నుంచి పార్టీలో వివిధ రకాల పోస్టుల్లో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

యాకుత్‌పురా నుంచి.. రవిరాజ్

గౌలిపురా: యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గం నుంచి తనకు పార్టీ టికెట్ కేటాయించాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.రవిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం..

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోరుతూ టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేటర్ పులిపాటి రాజేశ్ కుమార్ శుక్రవారం దరఖాస్తు చేసుకోవడం జరిగింది. పులిపాటి రాజేశ్ కుమార్ తరఫున కాంగ్రెస్ నాయకులు ఎస్.ప్రశాంత్, కె.వెంకట సురేశ్, మల్లేష్, సతీష్ గాంధీభవన్‌లో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు.



దరఖాస్తు అందజేస్తున్న పర్వతాల రాజేందర్



యాకుత్‌పురా టికెట్ కోసం.. రవిరాజ్



బహదూర్‌పురా టికెట్ కోసం.. రాజేశ్ కుమార్

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి



బాక్స్ టైప్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని అలహస్‌నాత్ కాలనీ, నిజాం కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ మహ్మద్ సిరాజ్ ఇంటి లెన్ ముందు జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఆయన అక్కడ ఉన్న అధికారులపై మండిపడ్డారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బాధ్యత ఎవరిదని ఆయన అన్నారు. వర్షాకాలం ముగుస్తున్నా పనుల్లో వేగం పెరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని ఆయన అన్నారు. గంట సేపు వర్షం కురిస్తే మిలట్రీ ఏరియా నుంచి అలహస్‌నాత్ కాలనీ మీదుగా నిజాం కాలనీ గూండా టోలిచౌకీ వద్ద చేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా డీఈఈ రామకృష్ణ, ఏఈ వెంకటశేషయ్య, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్‌ఫరాన్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



ఎంజేమార్కెట్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎంజేమార్కెట్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోషామమల్ నలుమూలలా ఏ సమస్య ఉన్నా మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి అన్ని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. బీజేపీతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్, అహ్మద్, శేఖర్, సందీప్, వికాస్, బాల్‌రాజ్, నరేష్ గౌడ్, ఓం, షమి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలి

సుల్తాన్‌బజార్: నాయీ బ్రాహ్మణులకు ప్రతి పార్టీ నుంచి ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు దేవరకొండ నాగరాజు, జంపాల రాజేష్, విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హనుమాన్ టేక్డీలోని బీసీసాధికారత భవన్‌లో నాయీ బ్రాహ్మణ రాజకీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విద్యాసాగర్ మాట్లాడుతూ..స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్నా నాయీ బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగలేదన్నారు. నాంపల్లి నియోజకవర్గం నుంచి విద్యాసాగర్‌కు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు వికాస్, రాకేష్, శ్రీను, శ్రీనివాస్, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం’



మాట్లాడుతున్న అస్సాం ఎమ్మెల్యే కౌశిక్‌రాయ్

గోల్కొండ: ప్రజా సంక్షేమం బీజేపీకి మాత్రమే సాధ్యమని అస్సాం ఎమ్మెల్యే కౌశిక్‌రాయ్ అన్నారు. ఎమ్మెల్యే ప్రబాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఎస్‌బీఐ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అంతకు ముందు ఆయన గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వానికి చెందినవే అని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో నిధులు తీసుకోని బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల పేర్లను మార్చి ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. సీనియర్ నాయకులు రాములు, గంగాధర్, విజేందర్, పవన్, విజయానంద్, దేవర వంశీ పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకుడు రమేష్

సుల్తాన్‌బజార్: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం వైద్య గర్జనను నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, పల్లం ప్రవీణ్‌కుమార్, లాలు ప్రసాద్‌రాథోడ్, అజ్మీర రంగా, శేఖర్, డాక్టర్ నరహరిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖలోని డీఎంఈ తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీహెచ్ ఈఎస్ఐ వైద్యుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అన్ని వైద్య సంఘాలను ఏకతాటిగా తీసుకువచ్చామని, ఈ ఐక్యతతోనే తెలంగాణ కోసం ఏ విధంగా పోరాడి రాష్ట్రాన్ని సాధించామో అదే మాదిరిగా తమ సమస్యలపై ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు



పాన్ షాపును మూయిస్తున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి

సంతోష్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి దాటిన అనంతరం వ్యాపారాలు నిర్వహిస్తున్న పాన్‌షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా అర్ధరాత్రి దాటిన అనంతరం అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న యువకులను ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా లాటరీ నిర్వహిస్తున్న నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్, పిసల్‌బండ, జీఎం నగర్‌లో గురువారం అర్ధరాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..వ్యాపారులు పోలీసుల సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. వ్యాపారులు సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. ఎస్సై పద్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



చార్మినార్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఓటరు లిస్టులపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్ డీడీ నాయక్ అన్నారు. శుక్రవారం మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని తన కార్యాలయంలోని నియోజకవర్గంలోని అఖిల పక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ, చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఉన్నారు.

ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలి



చాంద్రాయణగుట్ట: ఓటరుజాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాను డివిజన్ల వారిగా శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల పోలింగ్ రోజున తమ పేర్లు గల్లంతయ్యాయని చాలా మంది ఆందోళనలకు దిగుతుంటారన్నారు. అలాంటివి జరగకుండా ఇప్పుడే పేర్లను పరిశీలించుకోవాలన్నారు. రాఘవేందర్ రాజు, నరేష్, మహేందర్, తిరుమలేష్ పాల్గొన్నారు.